క్లుప్తంగా

బీమా తక్షణ సాయం అందజేత

శిరివెళ్ల: యర్రగుంట్లకు చెందిన పుల్లయ్య కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ. 10 వేలు సర్పంచు సుభహాన్ గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పుల్లయ్య ఈ నెల 17న గుండెపోటుతో మరణించడంతో బీమా పథకం తక్షణ సాయం మంజూరైందన్నారు. ఆ మొత్తాన్ని మృతుడి భార్య వెంకట శివమ్మకు అందజేశామని చెప్పారు. ఉప సర్పంచు సత్తార్ ప్రతాపరెడ్డి, గాజ కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

గోస్పాడు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరారు. గురువారం మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో లబ్ధిదారులతో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి ఫిబ్రవరి 6 తేదీ వరకు సీపీఐ పోరాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇల్లు లేని లబ్ధిదారులకు నిర్మాణ కోసం ఇప్పటివరకు రూ.1.80 లక్షలు మాత్రమే ఇస్తుందని, ఈ మొత్తం ఏ మాత్రం సరిపడదని, రూ.5లక్షల అందజేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రమేష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు వేస్తున్న దృశ్యం

శిరివెళ్ల: యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో ప్రభుత్వ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి. గురువారం రూ. 12 లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులను సర్పంచు అయ్యలూరి సుభహాన్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు గ్రామంలో రూ. 75 లక్షలతో అభివృద్ధి పనులు జరిగాయన్నాయన్నారు. ఉప సర్పంచు సత్తార్ ప్రతాపరెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు గాజ కృష్ణారెడ్డి, పీఆర్ ఏఈ రవికుమార్, పంచాయతీ కార్యకార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

రుద్రవరం: మండలంలోని హరినగరంలో సర్పంచ్ సవరం కమలమ్మ ఆధ్వర్యంలో గురువారం కొత్త విద్యుత్ స్తంభాలు వేయించారు. పనులను వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగముని దగ్గరుండి చేయించారు. కొద్ది రోజుల క్రితం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించగా స్థానికులు స్తంభాల సమస్యను ప్రస్తావించారు. స్పందించిన ఆయన కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ ఏఈ రాఘవేంద్రారెడ్డిని ఆదేశించారు. దీంతో గ్రామంలో 18 కొత్త విద్యుత్ స్తంభాలను అమర్చి తీగలను సరి చేశారు.

తప్పిన ప్రమాదం



కాలువలోకి దూసుకుపోయిన మినీ లారీ

దొర్నిపాడు: విద్యుత్ పరికరాలతో వెళ్తున్న ఓ మినీ లారీ అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకెళ్లిన ఘటన గురువారం మండల కేంద్రం దొర్నిపాడు శివారులో చోటు చేసుకుంది. బేతంచర్లకు చెందిన లారీ హైదరాబాద్ నుంచి దొర్నిపాడు మీదుగా చిత్తూరుకు వెళ్తోంది. దొర్నిపాడు సమీపంలో అదుపు తప్పి పంట కాల్వలోకి దూసుకెళ్లింది. లారీ రెండు డోర్లు లాక్ కావడం డతో పాటో కాలువ అంచుల్లో ఇరుక్కుపోవడంతో డ్రైవర్ గోపాల్ ముందు అద్దం పగలగొట్టి బయటకు వచ్చాడు. స్వల్ప గాయాలతో బయట పడిన డ్రైవర్‌ను వైద్యశాలకు తరలించారు. విద్యుత్ పరికరాలను మరో లారీలో తరలించి, వాహనాన్ని క్రేన్ సాయంతో బయటకు తీశారు.

కేసు నమోదు

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామానికి చెందిన చెన్నయ్య అనే వ్యక్తిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన శేఖర్ భార్యను చెన్నయ్య దుర్భాషలాడాడు. తన భార్యను ఎందుకు తిడుతున్నావని ప్రశ్నించినందుకు శేఖర్‌పై దాడికి పాల్పడ్డాడు. బాధితుడికి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపాల్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

గోస్పాడు: మధ్యాహ్న భోజనం పథక నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు హరినాథ్, జిలానీ కోరారు. మండలంలోని యాళ్లూరు గ్రామ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని గురువారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ పథక కార్మికులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందని ఆరోపించారు. వంట నిర్వాహకులు విద్యార్థుల భోజనాలు చేసేందుకు అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు నెలలు గడుస్తున్నా చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. బిల్లులు ఎప్పటికప్పుడు అందించాలని కోరారు. నాయకులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

సంక్షేమంతో పేదల జీవితాల్లో వెలుగులు

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- ఆళ్లగడ్డలో కొనసాగుతున్న 'గడప గడపకు మన ప్రభుత్వం'



వృద్ధురాలికి పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే సీఎం జగనన్న సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ప్రస్తుతం వారి జీవితాలు అభివృద్ధి బాట పట్టాయని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 5వ సచివాలయ పరిధిలోని 21, 22 వార్డులు, ప్రతాప్ థియేటర్, సాగర్ వీధి, విద్యానగర్ వీధుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ పాలన తీరు, అధికారుల స్పందన, వలంటీర్ల విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. మూడున్నరేళ్లలో అందిన సంక్షేమ పథకాలను వివరించి అందిన మొత్తాన్ని తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఒక ఇంటికి సంక్షేమ పథకం వర్తించాలంటే అదో ప్రహసనంగా ఉండేదని, గల్లీ స్థాయి నుంచి ప్రజా ప్రతినిధి ఇళ్ల చుట్టూ తిరగడమే కాకుండా అంతో ఇంతో ముట్టజెప్పాల్సి వచ్చేదని, ఇందులో జన్మభూమి కమిటీల సూచనే ఫైనల్‌గా ఉండేదని చెప్పారు. ఇలా గ్రామంలో కొందరికి మాత్రమే అందేవన్నారు. ప్రస్తుతం సిఫారసులు లేకుండా కేవలం అర్హులైతే చాలు, ఇంటికి నాలుగు నుంచి ఎనిమిది పథకాలు అందజేస్తున్నామని, గ్రామంలో పథకాలు అందని ఇల్లు లేదంటే ఏ స్థాయిలో పథకాలు అమలు చేస్తున్నారో అర్థం చేసుకోవాలని ప్రజలను కోరారు. అరకొరగా హామీలు నెరవేర్చి, ప్రజలను మభ్యపెట్టే వారు మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు బయలుదేరారని, వారి మాటలు నమ్మొద్దని, అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగనన్న సీఎంగా కొనసాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని, మీ ఆదరాభిమానాలు అలాగే ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాదం మరియమ్మ, కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి, సంజీవ, న్యాయవాది అశ్వత్థరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు రమేష్ గౌడ్, నాయకులు నరసింహారెడ్డి, సింగం వెంకటేశ్వరరెడ్డి, నజీర్, చెన్నయ్య, కిశోర్, నల్లవాగుపల్లె రఘు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం 'సీఎం సహాయ నిధి'



బాధితులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే శిల్పా రవి



మహిళకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల

నంద్యాల: ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరుపేదలకు వరం లాంటిదని, ఆరోగ్యశ్రీ సేవల కిందికి రాని వైద్యానికి ఈ పథకం ఆపన్న హస్తంలా నిలుస్తోందని ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గానికి చెందిన 13 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.13.5 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం తన నివాసంలో పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.4,07 కోట్లు బాధిత కుటుంబాలకు అందజేశామని చెప్పారు. కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన సత్యవతి అనే మహిళ ఇటీవల మోకాలుకు సర్జరీ చేయించుకుంది. దీంతో ఆమె సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.50 వేలు మంజూరయ్యాయి. గురువారం ఆళ్లగడ్డలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఇందుకు సంబంధించిన చెక్కును పార్టీ మండల నాయకులు శివరామిరెడ్డి, దయానందరావు, విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో అందజేశారు.

ముగిసిన ఫుట్‌బాల్ లీగ్ పోటీలు



- విజేతగా నిలిచిన ఏలూరు జట్టు

ఏలూరు జట్టుకు ట్రోఫీ అందించిన ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): హోరా హోరీగా జరిగిన రాష్ట్ర స్థాయి శాప్ ఫుట్‌బాల్ లీగ్ పోటీలు గురువారం ముగిశాయి. స్థానిక ఎస్పీజీ కళాశాలలో ఈ నెల 18వ తేదీ నుంచి జరిగిన పోటీలకు 12 జట్లు పాల్గొన్నాయి. అత్యంత ప్రతిభ చూపిన ఏలూరు జిల్లా జట్టు విజేతగా నిలవగా, రన్నర్‌గా నెల్లూరు, 3వ స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా నిలిచింది. ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడాకారులు నిత్యం సాధన చేస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారని, క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. గెలుపోటములను సమానంగా తీసుకుని ముందుకుసాగాలని సూచించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు రాజు, ఎస్పీజీ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్, శాప్ ఫుట్‌బాల్ స్టేట్ కన్వీనర్ మహ్మద్ సిరాజుద్దీన్, జిల్లా ఫుట్ బాల్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డీఈ నాగరాజు

ఉయ్యాలవాడ : ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ డీఈ నాగరాజు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మండల సమన్వయ కమిటీతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మొదటి విడతలో నియోజకవర్గ పరిధిలో ఆరు మండలాల్లో 8,240 గృహాలు మంజూరయ్యాయి. ఉగాది నాటికి 1,717 నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. నిర్ణీత సమయానికి నిర్మాణాలు పూర్తి చేసి ఉగాది పండుగ రోజు లబ్ధిదారులతో కలిసి సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించేలా ఉద్యోగులందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఉయ్యాలవాడ మండలంలో 130 గృహాల లక్ష్యంగా పూర్తి చేయవలసి ఉందన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయికి వెళ్లి ప్రతి లేఅవుట్ కాలనీలో రోజుకు ఐదుగురు లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు చేపట్టేలా శ్రమించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఏపీఓ రవిప్రకాష్, ఆర్ఐ తులసీకృష్ణ పాల్గొన్నారు.

25 నుంచి ధ్వజ ప్రతిష్ఠోత్సవాలు



చెన్నకేశవ, వీరభద్ర స్వామి ఆలయం

శిరివెళ్ల: కోటపాడు గ్రామంలోని శ్రీచెన్న కేశవస్వామి, వీరభద్రస్వామి ఆలయాల నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవాలు ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు జరుతున్నాయి. పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.24 లక్షలు మంజూరు చేసింది. వీటితో పాటు భక్తుల విరాళాలతో అభివృద్ధి పనులు, రెండు ముఖ ద్వారాల ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా 25న గంగాయానం, గణపతి పూజ, 26న యాగశాల ప్రవేశం, మండపారాధాన, హోమాలు, దీక్షా హోమం, 27న చండీ హోమం, ధ్వజ స్తంభాల గ్రామోత్సవం. 28న ఉదయం 5.46 గంటల నుంచి 7.20 గంటల మధ్య ధ్వజ స్తంభాల ప్రతిష్ఠ అనంతరం శ్రీదేవీ భూదేవీ సహిత శ్రీ చెన్న కేశవస్వామి కల్యాణం, పార్వతీ సమేత ఈశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తారు. 29న వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాల సందర్భంగా 26, 27,28 తేదీల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వేణునాథరెడ్డి, చైర్మన్లు వంకదార నరేంద్రబాబు, గురజాల గోపాలరెడ్డి గురువారం తెలిపారు.

పనులను గుర్తించండి



ఉపాధి హామీ పథకం కింద సాగుచేసిన గడ్డిని పరిశీలిస్తున్న పీడీ రామచంద్రారెడ్డి

గడివేముల: ప్రజలకు, రైతులకు అవసరమైన పనులను గుర్తించాలని నంద్యాల జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్రారెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని కొర్రపోలూరు గ్రామంలో పశువుల కోసం సాగు చేసిన గడ్డిని పరిశీలించారు. గ్రామంలోని ఉపాధి కూలీలతో ముఖాముఖి నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు, కూలీలకు ఉపాధిని కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. కూలీల సంఖ్య రోజురోజుకు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాలలో అందరికీ అమోదయోగ్యమైన పనులను వేగంగా గుర్తించి అన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటరమణ, టీఏలు ప్రసాద్, శంకరయ్య పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

బండిఆత్మకూరు: ప్రభుత్వ పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం ఇస్తున్నట్లు జాతీయ ఉపాధి హామీ పథకం నంద్యాల క్లస్టర్ సహాయ సంచాలకులు బాలాజీ నాయక్ తెలిపారు. గురువారం జీసీపాలెం, నెమళ్ల కుంట గిరిజన తండాల్లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ప్రభుత్వం వందరోజులు పనిదినాలు కల్పించడానికి ఏర్పాట్లు చేసిందన్నారు. కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలన్నారు. దీంతో కొందరు కూలీలు మాట్లాడుతూ ప్రస్తుతం వరినాట్లు ఉన్నాయని, కొంత కాలం తర్వాత పనులకు వస్తామని ఆయనతో తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ వసుధ, నాగార్జున, టీఏలు షేక్షావలి, ప్రసాద్, స్వాములు పాల్గొన్నారు.

యోగి వేమనకు నివాళి





వేమన చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీఈఓ అనురాధ, నివాళులర్పిస్తున్న డీఆర్ఓ పుల్లయ్య

నంద్యాల(సిటీ): ప్రజాకవి యోగి వేమన జయంతిని పురస్కరించుకొని డీఈఓ అనురాధ కార్యాలయంలో యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ యోగి వేమన సమసమాజం కోసం తన పద్యాల ద్వారా ప్రజలను చైతన్య వంతం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ గోపాల్, సూపరింటెండెంట్ లక్ష్మీనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్ఓ కార్యాలయంలో..

విశ్వకవి యోగి వేమన 391 జయంతిని పురస్కరించుకొని స్థానిక డీఆర్ఓ కార్యాలయంలో డీఆర్ఓ పుల్లయ్య ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీఆర్ఓ మాట్లాడుతూ ప్రజా కవిగా ప్రసిద్ధి గాంచిన వేమనను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. డీపీఆర్ఓ జయరావు తదితరులు ఉన్నారు.

రుద్రవరం: యోగి వేమన రచించిన పద్యాలు నిత్య నూతనమని, జీవిత సత్యాన్ని బోధిస్తాయని స్థానిక ఏపీ మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. యోగి వేమన జయంతి వేడుకల్లో భాగంగా గురువారం పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ తన పద్యాలతో సమాజాన్ని మేల్కొలిపారని కొనియాడారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, సురేష్ కుమార్, ఉపాధ్యాయులు కిరణ్ కుమార్,రమణ, సతీష్,పీడీ శ్రీనివాసులు, మధు, వసుందర,రాజ్ నారాయణ, సుధాకర్‌బాబు,జ్యోత్స్న శిరీషబాయ్ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: యోగి వేమన జయంతి వేడుకలను గురువారం స్థానిక ఐడీఎస్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ప్రైవేటు పాఠశాలల సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా మాట్లాడుతూ 16వ శతాబ్దంలోనే సమాజ కట్టుబాట్లు, మనిషి ప్రవర్తనలోని లోటుపాట్లను తన పద్యాల ద్వార ప్రశ్నించిన గొప్ప కవి వేమన అని కొనియాడారు.

శనగల బసవన్నకు పరోక్షసేవ



శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరుడికి గురువారం సాయంత్రం త్రయోదశి సందర్భంగా పరోక్షసేవను ఈఓ ఎస్ లవన్న, అర్చకులు నిర్వహించారు. ఇందులో భాగంగా నందీశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. శనగల బసవన్నకు శాస్త్రోక్తంగా విశేష అన్నాభిషేకాలను నిర్వహించారు. తరువాత నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను మహా నైవేద్యంగా సమర్పించారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు

లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను నిర్వహించింది. అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు. దేవస్థానం ఈఓ లవన్న పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలి

ఉయ్యాలవాడ : అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని కార్యకర్తలు సక్రమంగా పంపిణీ చేయాలని మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ సూచించారు. గురువారం మండలంలోని అల్లూరు గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు సరఫరా అవుతున్న గుడ్లు, పాలు, చిక్కీలు, పిండి, తదితర వాటిని సక్రమంగా పంపిణీ చేయడం లేదని ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. అలాగే పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

ధర్మదీక్షకు అనూహ్య స్పందన

నంద్యాల(అర్బన్): శ్రీశైలం ప్రాజెక్టు ఉన్న కర్నూలులోనే కేఆర్ఎంబీ కార్యాలయం ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో చేపట్టిన ధర్మదీక్షకు రాయలసీమ వ్యాప్తంగా అనూహ్య స్పందన లభించిందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధర్మదీక్ష నేపథ్యంలో సంతకాల సేకరణకు పిలుపునిచ్చామన్నారు. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే రాయలసీమ వ్యాప్తంగా దాదాపు 6వేల మందితో సంతకాల సేకరణ చేపట్టామన్నారు. ఈ పత్రాలతో పాటు కేఆర్ఎంబీని జిల్లాలో ఏర్పాటుపై సవివరణలతో కూడిన ఉత్తరాన్ని ముఖ్యమంత్రికి పంపాలని కోరుతూ నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు అందజేశామని చెప్పారు.

కోళ్లకు తెగుళ్లు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మహానంది: కోళ్లకు తెగుళ్లు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని లైవ్‌స్టాక్ వెటర్నరీ ఆఫీసర్ సులోచన సూచించారు. తమ్మడపల్లె గ్రామంలో గురువారం కోళ్లకు తెగుళ్లు రాకుండా వ్యాక్సిన్లు వేశారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి కోళ్లకు ఎఫ్-1 వ్యాక్సినేషన్ డ్రాప్స్, కే-1 వ్యాక్సిన్లను 0.5ఎం.ఎల్ చొప్పున వేసినట్లు ఆమె చెప్పారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కోళ్లను పెంచుకుంటున్న వారు స్థానిక పశు వైద్య కేంద్రాలను సంప్రదించి వ్యాక్సిన్లు వేయించాలని సూచించారు.

తప్పిపోయిన చిన్నారి

- గంటలోపే తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



చిన్నారి రజినాను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ సత్యబాబు

కమలాపురం: పట్టణంలో గురువారం తప్పిపోయిన మూడేళ్ల చిన్నారిని గంటలోపే పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. వైఎస్సార్ జిల్లా కమలాపురం సీఐ సత్యబాబు తెలిపిన వివరాలు.. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన రమేష్, గౌసియా దంపతులు కమలాపురంలోని పెద్ద దర్గాలో బంధువుల పిల్లల పుట్టు వెంట్రుకలు తీయించేందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో రమేష్ మూడేళ్ల కుమార్తె రజినా తినుబండారాలు కొనుక్కోవడానికి దర్గా నుంచి రోడ్డు పైకి వచ్చింది. దారి మరిచిపోయి ఏపీజీబీ వద్ద దాదాపు అరగంట పాటు ఏడుస్తూ ఉండగా రామ్ నగర్‌కు చెందిన చైతన్య ప్రకాష్ ఎత్తుకొని పలు కాలనీలు తిరిగాడు. అయితే ఎవరూ గుర్తించక పోవడంతో.. అతను మీడియాను సంప్రదించాడు. మీడియా వారు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు విషయాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేయించారు. విషయం తెలుసుకున్న చిన్నారి తల్లిందండ్రులు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. సీఐ సత్యబాబు వారిని విచారించి చిన్నారిని అప్పగించగా వారు పోలీలసుకు కృతజ్ఞతలు తెలిపారు.

'వైఎస్సార్ యంత్ర సేవ'ను సద్వినియోగం చేసుకోండి



పెద్దయమ్మనూరులో రైతులకు ట్రాక్టర్, పనిముట్లను అందజేస్తున్న వ్యవసాయాధికారి

ఉయ్యాలవాడ : వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద ప్రభుత్వం అందజేస్తున్న పనిముట్టను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. గురువారం మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామంలో శ్రీ భీమలింగేశ్వర రైతు మిత్ర గ్రూపునకు రూ. 15 లక్షల విలువ జేసే ట్రాక్టర్, విత్తనం గొర్రులు, గుంటుక, సామగ్రిని అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం యంత్ర సేవా పథకం కింద 50 శాతం సబ్సిడీ, 40 శాతం బ్యాంకు లోన్ లభిస్తుందని, మిగిలిన 10 శాతం గ్రూపు సభ్యుల వాటా చెల్లించవలసి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల కేడీసీసీ బ్యాంకు మేనేజర్ లక్ష్మీనారాయణ, వ్యవసాయ సహాయకురాలు భారతి, రైతు మిత్ర గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి
- మిట్నాలలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

నంద్యాల(రూరల్): పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మిట్నాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ వివరిస్తూ, వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు చేరుతోందో లేదో తెలుసుకునేందుకు, సమస్యలను పరిష్కరించేందుకు, మరింత మెరుగైన పాలన అందించేదుకు గడప గడప కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు ఇప్పల తిరుపతిరెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, సర్పంచ్ ఇప్పల.రాజశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ మహాలక్ష్మమ్మ, బాలిరెడ్డి, రాజశ్వరరెడ్డి, గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపుతున్నాం

నంద్యాల(సిటీ): పట్టణాన్ని అభివృద్ధి చేసి చూపుతున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 12వ వార్డు బాలజీ కాంప్లెక్స్‌లో రూ.19 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైన్‌లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేవలం మాటలకు పరిమితం కాకుండా పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నామని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా, కమిషనర్ రవిచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ కైప గోపాల్‌రెడ్డి, నాయకులు, కౌన్సిలర్ శ్యామ్‌సుందర్‌లాల్ పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



ఉపాధ్యాయినిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఈఓ అనురాధ

నంద్యాల(సిటీ): విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఈఓ అనురాధ తెలిపారు. గురువారం మండల పరిధిలోని చాపిరేవుల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. 9,10వ తరగతి విద్యార్థులు చిన్న ఇంగ్లిష్ పదాలను చదవడం, రాయడంలో పూర్తిగా విఫలమయ్యారు. విద్యార్థులు వెనకబడటానికి కారణమైన ఉపాధ్యాయినిపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా తాకీదులు జారీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి టీచర్‌పై ఉందన్నారు. హెచ్ఎం శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

రేపు 'దిశ' కమిటీ సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధి, సమన్వయం, పర్యవేక్షణ (దిశ) కమిటీ సమావేశం ఈ నెల 21న జరుగనుంది. ఈ కమిటీకి కర్నూలు ఎంపీ ఎస్.సంజీవ్‌కుమార్ చైర్మన్, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. సమావేశానికి నంద్యాల ఎంపీతో కర్నూలు,నంద్యాల జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు కూడ హాజరవుతారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం జరుగుతుందని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. జిల్లా నీటియాజమాన్య సంస్థ, డీఆర్‌డీఏ-వైకేపీ, వ్యవసాయ శాఖ, హౌసింగ్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ, మెప్మా, అటవీ శాఖ తదితర శాఖలకు కేంద్రం నుంచి విడుదల య్యే నిధుల వినియోగంపై కమిటీ పర్యవేక్షిస్తుంది.